క్లుప్తంగా...

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ హ్యాండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్



లంగర్‌హౌజ్: లంగర్‌హౌజ్‌లో ఏర్పాటైన ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్ హ్యాండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. సంఘం వద్ద ఏర్పాటైన ఈ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే కౌసర్ ఆదివారం ప్రారంభించారు. పిల్లలు, పెద్దలను ఆకట్టుకోవడమే కాకుండా ఆశ్చర్యపరిచే ఎన్నో త్రీడి జంతువుల బొమ్మలు ఈ ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి. త్రీడి యానిమేటెడ్ గొరిల్లాలతో పాటు ఎన్నో రకాల క్రూర జంతువుల వద్ద పిల్లలు, పెద్దలు సంబ్రమంగా వీక్షిస్తున్నారు. రకరకాల హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులు అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశామని ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాప్సాన్ తెలిపారు.

తనూశ్రీకి ఉత్తమ ప్రతిభా అవార్డు-2023



మెమొంటో, అవార్డుతో తనూశ్రీ

చార్మినార్: కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచిన తనుశ్రీకి భారత్ ఆర్ట్స్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభా అవార్డు-2023 లభించింది. పాతబస్తీ ఛత్రినాకకు చెందిన తనూశ్రీ చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటోందని.. రవీంద్ర భారతిలో జరిగిన కూచిపూడి నృత్యంలో చిన్నారి ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు లభించిందని చిన్నారి గ్రాండ్ ఫాదర్ అయిన కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాం రావు ముదిరాజ్ తెలిపారు.

ఘనంగా 22వ శరణ్ మేళా



తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్, లింగాయత్ మహాసభ ప్రతినిధులు

జియాగూడ: బసవ కల్యాణ్ పర్వ్ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బసవ కల్యాణ్‌లో పూజ్యశ్రీ మహాజగద్గురువు గంగా మాత నేతృత్వంలో 22వ కల్యాణ్‌పర్వ శరణ్ మేళా కార్యక్రమం ఏర్పాటు అయ్యింది. ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి భగవంతు హాజరై అన్నదానం భవనం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్ గౌరవ అధ్యక్షుడు సురేష్ ఎకోరే, రాష్ట్ర అధ్యక్షుడు శంకరప్ప పాటిల్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ కుర్తిమామ, ప్రధాన కార్యదర్శి అనిల్‌పాటిల్, లింగాయత్ మహాసభ అధ్యక్షుడు విజయకుమార్ పట్నే, తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్ ఉపాధ్యక్షులు జగన్నాథప్ప టైలర్, ప్రధాన కార్యదర్శి కె.మరుతి, ఉపాధ్యక్షుడు భగవంత్ జవాలే, జియాగూడ ఉపాధ్యక్షులు బసప్ప సాకోలే, కె.శివాజీ, సహకార్యదర్శి రాజేందర్ మేత్రి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నాతకోత్సవం



నాంపల్లి: అన్వర్ ఉలూం కళాశాల 5వ స్నాతకోత్సవాన్ని ఆదివారం న్యూ మల్లేపల్లిలోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. అన్వర్ ఉలూం ఎడ్యూకేషనల్ అసోసియేషన్ కార్యదర్శి నవాబ్ మహబూబ్ ఆలమ్ ఖాన్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కరుణసాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, గోల్డ్ మెడల్స్‌ను అందజేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అన్వర్ ఉలూం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ అహ్మద్ బేగ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ రజాక్, కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ రజాక్, సీనియర్ ప్రొఫెసర్ హాజీ సజ్జాద్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. నాంపల్లి జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని మహిళ లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా డౌన్‌లైన్‌లో వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చార్మినార్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన ఏమాయే ?



అలీ మస్కతి

- ఢిల్లీలో అలీ మస్కతి పేరు ప్రకటించిన రేవంత్‌రెడ్డి
- అయితే రెండు లిస్టులలో చార్మినార్ అభ్యర్థి ప్రకటన లేదు
- చార్మినార్‌ను వ్యతిరేకిస్తున్న అలీ మస్కతి కుటుంబ సభ్యులు
- ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో అలీ మస్కతి

చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గానికి ఇప్పటి వరకు అధికారికంగా అభ్యర్థి పేరు ప్రకటించ లేదు. ఇప్పటికే రెండు దఫాలుగా లిస్టులు వెలువడినప్పటికీ.. రెండింట్లో చార్మినార్ అభ్యర్థి పేరు లేదు. హైదరాబాద్ జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ పోటీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించినప్పటికీ.. చార్మినార్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు పేరు ప్రకటించ లేదు. అయితే ఊహించని విధంగా అనూహ్యంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాత్రం చార్మినార్ నియోజకవర్గం నుంచి అలీ మస్కతి ఎన్నికల బరిలో ఉంటారని ప్రకటించారు. అప్పటికీ పార్టీ అధిష్ఠానం ఎక్కడ ఏ ఒక్క అభ్యర్థిని ప్రకటించ లేదు. అయినప్పటికీ.. చార్మినార్ నుంచి అలీ మస్కతి పేరును విలేకర్ల ముందు ప్రకటించారు. చార్మినార్ నుంచి పోటీ చేయడానికి అలీ మస్కతి కుటుంబసభ్యులు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గతంలో ఒకసారి టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన చార్మినార్ కాకుండా మరో ఇతర స్థానం నుంచి పోటీ చేస్తే బావుంటుదనే ఆలోచనలో అలీ మస్కతి కుటుంబసభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ విషయంలో అలీ మస్కతి ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో ఉన్నట్లు ఆయన అనుచరులు బహిరంగంగా చెబుతున్నారు.



టికెట్ ఆశిస్తూ రూ.50 వేలు కట్టి దరఖాస్తులు చేసిన నాయకులు..

అప్పటి వరకు చార్మినార్ నియోజకవర్గం నుంచి తమకే టికెట్ కేటాయించాలని గాంధీభవన్‌లో రూ.50 వేలు కట్టి దరఖాస్తులు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆశావాహులు కొంత నిరాశకు గురయ్యారు. మొన్నటి వరకు టీడీపీలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేసిన అలీ మస్కతి గతంలో జరిగిన ఎన్నికల్లో చార్మినార్ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి పోటీ చేశాడని.. సడెన్‌గా పార్టీ మారడంతోనే చార్మినార్ టికెట్ ఎలా ఇస్తారని దరఖాస్తులు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ చోటామోటా నాయకులు పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఇప్పటి వరకు ఇక్కడి నుంచి ఇప్పటికే కె.వెంకటేష్, అస్గర్ అలీ బేగ్, షాబాజ్ ఖాన్, ముజీబుల్లా షరీఫ్, వంశీకృష్ణ తదితరులు తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తులు చేసుకున్నారు.

రేవంత్‌రెడ్డి ప్రకటనతో వెనక్కి తగ్గిన ఆశావహులు..

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటనల మేరకు దరఖాస్తులు చేసుకున్న వారిలో ఎవరో ఒకరికి టికెట్ వస్తుందని ఆశించినప్పటికీ.. అలీ మస్కతి పేరును ఢిల్లీలో రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో వీరంతా తమ పోటీ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇందులో ఏ ఒక్కరూ అలీ మస్కతి ప్రకటనను వ్యతిరేకించ లేదు. అయినప్పటికీ.. పాతబస్తీలోని యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించగా.. చార్మినార్ పార్టీ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో తిరిగి ఆశావహులు ఎంతో ఆశతో టికెట్ కోసం ఎదురు చూస్తున్నారు. టికెట్ ఆశించిన చార్మినార్ నాయకులంతా గాంధీ భవన్ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. నియోజకవర్గంలో సీనియర్లమైన తమకు మాత్రమే టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్న వారు కొందరైతే.. ఎన్నో ఏళ్లుగా పార్టీలో క్రియాశీలక కార్యకర్తలుగా, నాయకులుగా పని చేస్తున్న తమకు కాకుండా ఇటీవల పార్టీ మారిన నాయకునికి టికెట్ కేటాయించడం సరైంది కాదని మరికొందరంటున్నారు.

అలీ మస్కతిని గెలిపిస్తాం..

ఇప్పటికే టీడీపీ నుంచి పోటీ చేసి మజ్లిస్ పార్టీకి గట్టి పోటీనిచ్చిన అలీ మస్కతికి చార్మినార్ నుంచి టికెట్ కేటాయిస్తే.. భారీ మెజార్టీతో గెలిపిస్తామని మరికొంత మంది నాయకులు బహిరంగంగా చెబుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల బరిలోకి దిగుతామని ఈ ఎన్నికల్లో పెద్ద ఎత్తు ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆశించిన ఫలితాలు సాధించడానికి కృషి చేస్తామంటున్నారు. ఎలాంటి బేధాభిప్రాయాలకు తావివ్వకుండా నియోజకవర్గంలోని అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ జెండాపై పోటీ చేసి విజయం సాధిస్తామంటున్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పని చేస్తామంటున్నారు.

జంగ్ తెలంగాణ 2023

'అభివృద్ధి పథకాలతోనే విజయం సాధిస్తాం'

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వైపే మొగ్గుచూపుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు, పెన్షన్లు, రైతులకు ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లాంటి పథకాలతో బీఆర్ఎస్‌లో చేరేందుకు పలు పార్టీల వారితో పాటు స్థానిక నాయకులు కూడా పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారన్నారు. సంఘ సేవకులు, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఫజల్‌తో పాటు దాదాపు 100 మంది నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పథకాలతోనే విజయం సాధిస్తామన్నారు. పదేళ్లుగా గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. బీఆర్ఎస్‌తోనే పెద్ద ఎత్తున కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మహ్మద్ వహీద్‌ఖాన్, ఫయాూమ్, నిఖత్ పాల్గొన్నారు.



నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన మహ్మద్ ఫజల్, పలువురు నాయకులు

వికలాంగులకు అండగా మజ్లిస్ పార్టీ



వికలాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వికలాంగులకు మజ్లిస్ పార్టీనే కాకుండా తను కూడా ఎప్పుడూ అండగా ఉంటున్నానన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ మోగల్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ వికలాంగుడు ఆయనను కలిసి తన సమస్యలను ఆయనకు వివరించారు. ఎంతో మంది వికలాంగులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ సరిపోవడం లేదని ఆ వికలాంగుడు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్‌లో కేవలం వికలాంగులకే ఎక్కువ పింఛన్ అందిస్తుందన్నారు. ప్రతి యేటా మజ్లిస్ పార్టీ తరఫున కూడా పేద విద్యార్థులకు, వికలాంగులకు వివిధ రకాలుగా సహాయం చేస్తున్నామని అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బద్రుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

అందరి సహకారంతోనే విజయం



బీజేపీ, బీజేవైఎం నాయకులతో మాట్లాడుతున్న అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి బీజేపీ విజయ దుందుబి మోగించడం ఖాయమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం, బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ బీఆర్ఎస్ తొత్తుగా మారిందన్నారు. కేవలం మజ్లిస్ పార్టీని ప్రసన్నం చేసుకోవడానికే సీఎం కేసీఆర్ మజ్లిస్ పార్టీ ఆగడాలను భరిస్తున్నారని అన్నారు. మరో వైపు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు పార్టీలు మార్చే ఊసరవెల్లి అని ఆయన అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

ధూల్‌పేటలో ఎమ్మెల్యే రాజాసింగ్ పర్యటన



ధూల్‌పేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: ధూల్‌పేటలోని పలు ప్రాంతాల్లో గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ ఆదివారం పర్యటించారు. ధూల్‌పేట్, లాలభవన్, టక్కరివాడి, జుంగూర్‌బస్తీ, జాలిహనుమాన్, పార్థివాడి, జలక్షత్రియ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. మరోసారి తనను గెలిపిస్తే గోషామహల్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. పదేళ్లుగా నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని పేర్కొన్నారు.

సంగీత కళలు మన జాతి సంపద

గన్‌ఫౌండ్రీ: సంగీత కళలు మన జాతి సంపద అని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్ గుప్తా తెలిపారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమి, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ వెంకట చిన్నసత్యం 94వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిరి మువ్వలు పేరిట నిర్వహించిన సాంప్రదాయ కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు నృత్యగురువులను ఘనంగా సన్మానించారు. డిసెంబర్ 24న 8 వేల మంది కళాకారులతో నిర్వహిస్తున్న కూచిపూడి కళావైభవం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సినీనటి మలక్‌పేట శైలజ, స్వామిరామానంద తీర్థ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ సాయిలక్ష్మి, వెంకట చినసత్యం కూతురు కామేశ్వరి, కూచికూడిపూడి నృత్యగురువు శేషుబాబు, భారత ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లలిత తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

విశ్వకర్మలకు ప్రాధాన్యత కల్పించాలి



అనురాధ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బీబీనగర్ అనురాధ నియమితులయ్యారు. ఆదివారం ఆమెకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు విశ్వకర్మలకు సముచిత ప్రాధాన్యతను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, మహిళా విభాగం అధ్యక్షురాలు చిలుకూరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవం



నృత్యగురువు కళాకృష్ణను సత్కరిస్తున్న నవ్యనాటక సమితి ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: అభినయ విద్యలో కూచిపూడి నృత్యంలో నాట్య గురువులు యువ కళాకారులకు మెళకువలు నేర్పించడం ఎంతో అభినందనీయమని కేంద్ర సంగీత అకాడమీ పురస్కార గ్రహీత కళాకృష్ణ అన్నారు. నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాలు ఆదివారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ భాషా నిలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నాయికా అభినయం అనే వర్క్‌షాప్‌ను ప్రముఖ నృత్య కళాకారులు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత కళాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నాయికా అభినయం అనే అంశంపై యువ కళాకారులకు ప్రముఖ విద్యావేత్త, పండితులు డాక్టర్ నందూరి విద్యారణ్యస్వామి మెళకువలు నేర్పించారు. అనంతరం కళాకృష్ణను ఘనంగా సన్మానించారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి



మాట్లాడుతున్న సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ

గోల్కొండ: గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని అఖిల భారత సిరత్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. ఆదివారం రిసాల బజార్‌లోని మజీద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాజాలోని మహిళలు, చిన్న పిల్లలను టార్గెట్ చేసుకొని ఇజ్రాయిల్ సేనలు దాడులు చేస్తుందని ఆయన అన్నారు. కేవలం పాలస్తీనా ప్రజల కక్షతోనే ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేయడమే కాక తమ సైన్యాన్ని కూడా గాజాలో పంపి అల్లకల్లోళం సృష్టిస్తుందని ఆయన అన్నారు. ప్రపంచ దేశాలు పాలస్తీన ప్రజల హక్కుల పరిరక్షణకు అండగా ఉంటూ ఇజ్రాయిల్ తమ దాడులను వెంటనే ఆపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వం కూడా యుద్ధం ఆపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు మరింత భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్

అబిడ్స్: ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలకు మరింత భరోసా కల్పించే విధంగా పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం షాహినాయత్‌గంజ్, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ల పరిధులలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ.. జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ప్రాంతాల్లో తరచూ పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల మనోధైర్యాన్ని పెంపొందిస్తునట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అశ్వక్, ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నాగం రవీందర్, శోభన్‌బాబు, ఎ.రవికుమార్, ఎస్ఐలు లక్ష్మయ్య, అస్లాంలతో పాటు పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ అశ్వక్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు

కాలినడకన శబరిమలకు అయ్యప్పస్వాములు



పవన్ నాయుడు గురుస్వామి, దేసాయి గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు వెళ్లిన స్వాములు

అబిడ్స్: కాలినడకన పాదయాత్రతో 160 మంది అయ్యప్పస్వాములు శబరిమలకు బయల్దేరి వెళ్లారు. ఆదివారం బషీర్‌బాగ్ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పవన్‌నాయుడు గురుస్వామి, దేసాయి గురుస్వామి, రాము గురుస్వామి, బాబురాజ్ గురుస్వామి, సాయియాదవ్ గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములందరూ స్వామియే శరణమయ్యప్పా అంటూ కాలినడకన బయల్దేరారు. వీహెచ్‌పీ జాతీయ నాయకులు రామరాజ్‌తో పాటు పలువురు నాయకులు అయ్యప్పస్వాములను సాగనంపారు.

వైభవంగా యువభారతి వార్షికోత్సవం

సుల్తాన్‌బజార్: తెలుగు భాషా సాహిత్యాలకు అనితర సాధ్యమైన సేవ చేసిన యువభారతి సాహితీ సాంస్కృతి సంస్థ 65వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వతి పరిషత్ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాంతా బయోటెక్ అధినేత పద్మభూషణ్ డాక్టర్ కేఐ.వరప్రసాద్‌రెడ్డి చాగంటి కోటేశ్వరరావు ప్రవచించిన శ్రీమద్రామాయణం అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి, ఎంఎస్‌కో ప్రచురణ సంస్థ చంద్రశేఖరరెడ్డి యువ భారతితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. సంస్థ అధ్యక్షులు ఆచార్య ఫణీంద్ర యువభారతి భవిష్యత్ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలం నృత్యశాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ రుద్రవరం సుధాకర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన జరిగింది. సాయంత్రం జరిగిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కేవీ.రమణాచారి హాజరై ఆయాల సోమయాజుల నాగేశ్వరరావు రచించిన నన్నయ్య సూక్తి సుధ ప్రచురణను, వజ్రోత్సవ సంచిక అయిన యువభారతి వజ్రోత్సవ హారతి అనే గ్రంథాలను ఆయన ఆవిష్కరించారు. యువభారతి సంస్థలు దశాబ్దాలుగా పనిచేసిన సంస్థ సభ్యులందరూ జ్ఞాపకాలను మధురస్మృతులను సభికులతో పంచుకున్నారు.



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న కేవీ.రమణాచారి


ఉద్యోగుల సంక్షేమానికి మంజీర సొసైటీ కృషి



సమావేశంలో పాల్గొన్న మంజీర సొసైటీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, సెక్రటరీ కోటిరెడ్డి తదితరులు

అబిడ్స్: కెనరా బ్యాంక్ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది సంక్షేమానికి మంజీర కెనరాబ్యాంక్ ఎంప్లాయిస్ సొసైటీ అహర్నిశలు కృషి చేస్తుందని ఆ సొసైటీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి పేర్కొన్నారు. పలు సంవత్సరాలుగా ఉద్యోగుల సంక్షేమానికి తమ సొసైటీ ముందుండి వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మంజీర సొసైటీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ తిరుమల్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కెనరా బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సహకారంతో సొసైటీ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. సొసైటీ కార్యదర్శి కోటిరెడ్డి మాట్లాడుతూ.. మంజీర సొసైటీ 24 గంటల పాటు ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వికాస్, ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ మంజుల, సొసైటీ డైరెక్టర్లు శివారెడ్డి, గొరిగె శ్రీనివాస్, సూర్యకుమార్, శివశంకర్‌రెడ్డి, రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, ఎ.రాజశేఖర్, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శివకుమార్ మాదిగ, పూజలోల్ల రవిమాదిగ తదితరులు

అబిడ్స్: ఎస్సీ వర్గీకరణ మాదిగల జన్మహక్కు అని ఎంఎస్‌పీ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కొండ్రపల్లి శివకుమార్ మాదిగ పేర్కొన్నారు. నవంబర్ 18న పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గోషామహల్ పరిధిలోని గోడేకబార్‌లో జరిగిన గోషామహల్ నియోజకవర్గం ఎంఎస్‌పీ నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పెద్ద ఎత్తున మాదిగల విశ్వరూప మహాసభలో లక్షలాది మంది పాల్గొని మాదిగల సత్తా చాటాలన్నారు. ఈ నెల 31న బన్సీలాల్‌పేట సీసీనగర్‌లో హైదరాబాద్ జిల్లా విశ్వరూప సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్‌పీ జాతీయ నాయకులు ఎస్.నరేందర్ బాబు మాదిగ, ఇనుముల నర్సయ్య మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు పూజలోల్ల రవి మాదిగ, అడ్డాకుల లక్ష్మణ్, ములుగు శివ మాదిగ, శీనన్న మాదిగ, అశోక్‌మాదిగ పాల్గొన్నారు.

రమణీయం 'కళామాల'

గన్‌ఫౌండ్రీ: అభినేత్రి ఆర్ట్స్ అకాడమీ 20వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. కళామాల పేరిట సంస్థ చిన్నారులు ఏకకాలంలో ప్రదర్శించిన నృత్యాంశాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ పుణ్యక్షేత్రాలను ప్రతిబింబిస్తూ కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన సమ్మోహితులను చేసింది. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ప్రమోద్, పలువురు నృత్యగురువులు పాల్గొన్నారు.



సలావుద్దీన్ లోధీకి సత్కారం

చార్మినార్: బోనాల పండగ సందర్భంగా అమ్మవారి ఆలయాలకు ప్రభుత్వం తరఫున ఎలాగైతే ఆర్థిక సహకారం లభిస్తుందో.. అలాగే వాల్మీకి ఆలయాలకు కూడా నిధులు ఇచ్చేటట్లు తాను ప్రయత్నిస్తానని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. వాల్మీకి జయంతి వేడుకలు సుల్తాన్‌షాహీలోని వాల్మీకి మహరిషి ఆలయంలో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహ్మద్ సలావుద్దీన్ లోధీకి ఉత్సవాల నిర్వాహకులు మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయేది కూడా తమ ప్రభుత్వమేనని.. నిధుల మంజూరీకి తాను కృషి చేస్తానన్నారు. పత్తర్‌గట్టి బీఆర్ఎస్ అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ అహ్మద్, నిర్వాహకులు మనోజ్ బిడ్లా, రాజేష్, శ్యాంలాల్, దేవేందర్, ధర్మేందర్ బిడ్లా పాల్గొన్నారు.



సలావుద్దీన్ లోధీని సత్కరించి మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు